# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-11-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. శ్రీకాకుళం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు సూచించారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా స్థానిక సంస్థల కోటా శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల అయింది.**

**3. తెలంగాణలో ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.**

**4. రాష్ట్రంలో రోడ్ల మరమ్మతు పనులను 750 కోట్ల రూపాయలతో చేపట్టనున్నామని ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తెలిపారు.**

**5. ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ, గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు.**

==========================

శ్రీకాకుళం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులు సకాలంలో ఖర్చు చేసి జిల్లా అభివృద్ధిలో అధికారులు అంతా భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో నిన్న రాత్రి ఆయన జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో 10 వేల ఏకరాల్లో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. త్రాగునీరు.. సాగునీరు సమస్య లేకుండా వుండేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్‌ను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అన్ని రంగాల్లో శ్రీకాకుళం జిల్లాను అగ్రగామిగా నిలపాలని ముఖ్యమంత్రి కోరారు.

-------------------------

వస్తు సేవల పన్ను..జీఎస్‌టీ వసూళ్లలో అక్టోబరు నెలలో ఆంధ్రప్రదేశ్ 12 శాతం, తెలంగాణ రాష్ట్రం 7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత నెలలో ఆంధ్రప్రదేశ్‌లో 3 వేల 815 కోట్లు, తెలంగాణలో 5 వేల 211 కోట్ల రూపాయల జీఎస్‌టీ వసూలైనట్లు కేంద్ర ఆర్థికశాఖ నిన్న విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జాతీయస్థాయిలో

అన్ని రాష్ట్రాలూ కలిపి సగటున 10.63 శాతం వృద్ధిరేటును నమోదు చేశాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా స్థానిక సంస్థల కోటా శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల అయింది. ఈ మేరకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 4వ తేదీన నోటిఫికేషన్ అమలులోకి రానుంది. 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 12వ తేదీన పరిశీలన ఉంటుంది. 14వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఈ నెల 28వ తేదీన ఎన్నిక నిర్వహిస్తారు. డిసెంబర్ 1వ తేదీ ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

కాగా.. స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నిక నోటిఫికేషన్ వెలువడడం, తక్షణమే కోడ్ అమలులోకి రావడంతో ఈరోజు విజయనగరం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన రద్దు అయింది.

---------------------------

తెలంగాణలో ఈ నెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ప్రభుత్వ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా 3 రోజులపాటు ఇళ్ల గుర్తింపు కార్యక్రమాన్ని పలు జిల్లాల్లో చేపట్టారు. సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నారు. సమగ్ర కుల గణనలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. భవిష్యత్తులో అన్ని పథకాలకు ఈ సర్వే మెగా హెల్త్ చెకప్‌లా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో రోడ్ల మరమ్మతు పనులను 750 కోట్ల రూపాయలతో చేపట్టనున్నామని ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... మహిళలకు ప్రభుత్వం దీపావళి కానుక అందించిందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు సమాన స్థాయిలో అమలు చేస్తున్నారని వెల్లడించారు. మూడు నెలలలోగా ఎప్పుడైనా గ్యాస్ బుక్ చేసుకుని ఉచితంగా సిలిండర్లు పొందవచ్చని, 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని మంత్రి వివరించారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా నిన్న లోకేశ్ యూఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్, ఇండియాస్పోరా, సేల్స్‌ఫోర్స్‌తో పాటు గూగుల్ క్లౌడ్ ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమై చర్చించారు. సువిశాలమైన తీరప్రాంతం, విస్తృతమైన రహదారులు, జల, వాయు రవాణా మార్గాలతో పాటు పెట్టుబడులకు ప్రోత్సాహకర విధానాలు కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునేవారికి ఇదే మంచి సమయమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

---------------------------

సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం, చరిత్ర, భాషలు, మతాల వంటి భిన్నత్వంలోనూ ఏకత్వం అనే దారంతో భారతదేశం ముడిపడి ఉందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిన్న పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్, హరియాణా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు వంటి రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలు అండమాన్ నికోబార్ దీవులు, చండీఘర్, ఢిల్లీ, లక్షద్వీప్, పుదుచ్చేరిల అవతరణ దినోత్సవాలను 'ఏక్‌భారత్ శ్రేష్ఠ్ భారత్'లో భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో పాటు ఆయన సతీమణి సమీర నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఏక్ భారత శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమం దేశంలోని ప్రజలందరి మధ్య బలమైన బంధాన్ని, బంధుత్వాన్ని ఏర్పరుస్తుందన్నారు.

--------------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమసేవలు అందిస్తున్న వారికి ఈ ప్రతిభా పురస్కారాలు ఇస్తామని గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు విభాగాల్లో పురస్కారాలు ఉంటాయన్నారు. ఈ రోజు నుంచి ఈ నెల 23వ తేదీ వరకు గవర్నర్.తెలంగాణ.జీవోవీ.ఇన్ ద్వారా లేదా రాజ్ భవన్ చిరునామాకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని వెంకటేశం సూచించారు.

--------------------------

ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ, గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మొటిక్ ఛార్జీలను 40 శాతం పెంచినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఛార్జీల పెంపుదలతో 7 లక్షల 65 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, వసతి గృహాల సిబ్బందిపై ఉందని సీతక్క స్పష్టంచేశారు.

--------------------------

రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కాల్దరి గ్రామంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను నిన్న ఆయన పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధ్వంసమైన రహదారులకు నేటి నుంచి మరమ్మతులు చేపడతారని వెల్లడించారు.

--------------------------

పప్పుధాన్యాలు, నూనెగింజల సాగులో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు అధిక దిగుబడినిచ్చే వంగడాలను అందుబాటులో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ సంచాలకులు ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వ్యవసాయ కమిషనరేట్ నుంచి నిన్న ఆయన జిల్లాల వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అపరాలు, నూనెగింజల వ్యవసాయ పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు నూతన యాజమాన్య పద్ధతులు, సాగు ఆవిష్కరణలను వివరించారు.

--------------------------

ప్రయాణికులకు లబ్ధి చేకూరేలా రైల్వేశాఖ రిజర్వేషన్ విధానంలో మార్పులు చేసింది. ఈ మార్పులు నిన్నటి నుంచి అమలులోకి వచ్చాయి. గతంలో 120 రోజుల ముందుగా టికెట్లు రిజర్వేషన్ చేసుకొనే సదుపాయం ఉండేది. దానిని 60 రోజులకు తగ్గిస్తూ రైల్వేశాఖ తీసుకున్న నిర్ణయం అమలులోకి వచ్చింది. అయితే అక్టోబరు 31వ తేదీ లోపు రిజర్వేషన్ చేసుకున్న వారికి ఈ మార్పు వర్తించదు. నిర్ధారిత ప్రయాణికులను ప్రోత్సహించడానికే ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం గడువును తగ్గించామని రైల్వేశాఖ స్పష్టం చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిలిచిపోయిన కానిస్టేబుల్ ఉద్యోగ భర్తీ ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పోలీస్ నియామక మండలి.. ఏపీఎస్ఎల్ఆర్‌బి ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఆకే రవికృష్ణ తెలిపారు. వచ్చే నెల చివరి వారంలో శారీరక పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన నిన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

=======================